క్లుప్తంగా

లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న జడ్జి హరిప్రియ

కాశీబుగ్గ: వచ్చేనెల ఎనిమిదో తేదీన జరగబోయే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని పలాస ఇన్‌చార్జి మేజిస్ట్రేట్ సీహెచ్ హరిప్రియ అన్నారు. పలాస జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శుక్రవారం న్యాయవాదులు, పోలీసులతో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. కేసుల రాజీకి లోక్ అదాలత్ మంచి వేదికన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఏపీపీ రమేష్, బార్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ జి.ఎం.ఎస్.అనిల్‌రాజ్, లోక్‌అదాలత్ మెంబర్ గురుబెల్లి ప్రభాకర్‌రావు, న్యాయవాదులు బీకేఆర్ పట్నాయక్, హనుమంతు సుధారాణి, గురిబెల్లి ప్రభాకర్, విఘ్నేశ్వర రావు, కె.దేవరాజు, రవి, కాశీబుగ్గ సీఐ సూర్యనారాయణ, సీసీ నారాయణ, సూపరింటెండెంట్ కృష్ణ పాల్గొన్నారు.

కార్మిక చట్టాలను గౌరవించాలి



మాట్లాడుతున్న కిశోర్‌బాబు

సోంపేట: కార్మిక చట్టాలను అందరూ గౌరవించాలని మండల న్యాయసేవా సంఘం అధ్యక్షులు, జిల్లా ఆరవ అదనపు న్యాయమూర్తి కె.కిశోర్‌బాబు అన్నారు. శుక్రవారం బాండెడ్ లేబర్ నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని సోంపేటలో కనకదుర్గా కార్మిక సంఘం కార్మికులతో ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. కార్మికుల చట్టాలపై అవగాహన కల్పించారు. చిన్నపిల్లలను పనిలో పెట్టుకోకూడదన్నారు. కార్మికులను బంధించి పనిచేయించుకుంటే చట్టరీత్యానేరమన్నారు. కార్మిక అధికారి విజయ్‌కుమార్, న్యాయవాది కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు నెమలికొండపై భీష్మ ఏకాదశి వేడుకలు



విద్యుత్ వెలుగుల్లో నెమలికొండ

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి నెమలికొండ వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద శనివారం భీష్మ ఏకాదశి వేడుకలు జరగనున్నాయి. దీనికి కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశామని ఆలయ అభివృద్ధి సభ్యులు తెలిపారు. భక్తులందరూ విచ్చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని, సాయంత్రం భజన కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కాగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు.

డీఈఐసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



కేంద్రం సేవలపై ఆరాతీస్తున్న శ్రీనివాసరావు

టెక్కలి: విభిన్న ప్రతిభావంతులైన చిన్నారులకు సత్వరమే వైద్య సేవలు అందజేసే విధంగా జిల్లా ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన డీఈఐసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి జె.శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం స్థానిక డీఈఐసీని పరిశీలించి అక్కడ అందుతున్న సేవల గురించి తెలుసుకున్నారు. ఈ కేంద్రంపై గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. డిప్యూటీ డీఎం అండ్‌హెచ్‌ఓ మేరీ కేథరిన్, ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.సూర్యారావు, ఆర్ఎంఓ మహరాజ్, డీఈఐసీ వైద్యుడు ఎస్.రాజశేఖర్, మేనేజర్ అప్పలనాయుడు ఉన్నారు.

శ్రమదానంతో రోడ్డుకు మరమ్మతులు



రోడ్డును బాగు చేస్తున్న దృశ్యం

వజ్రపుకొత్తూరు: పెద్దబొడ్డపాడు పంచాయతీ నారాయణపురంలో రహదారి గోతులమయమై నడవడానికి వీలు లేకుండాపోయింది. పూండి-వెంకటాపురం రహదారి నుంచి నారాయణపురం వరకు సుమారు 200 మీటర్ల మేర రహదారి పూర్తిగా శిథిలమై గోతులు ఏర్పడ్డాయి. కూటమి ప్రభుత్వ నేతలకు, అధికారుల దృష్టికి గ్రామ రహదారి దుస్థితి తీసుకెళ్లినా స్పందించకపోవడంతో గ్రామానికి చెందిన దాత బడే కృష్ణమూర్తి నిధులు వెచ్చించి శుక్రవారం పనులు చేపట్టారు. గుంతలు పూడ్చి గ్రావెల్‌ను వేసారు. దీంతో వాహనాలు, పాదచారులు నడిచి వెళ్లేందుకు అవకాశం కలిగిందని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు.

రైతులను ముంచేస్తున్న మిల్లర్లు!

- దళారుల ద్వారానే మిల్లర్లకు చేరుతున్న ధాన్యం
- తూకాల్లో అవకతవకలు
- అమ్మకాల కోసం ఎదురు చూపులు



అమ్మకానికి సిద్ధంగా ఉన్న ధాన్యం

పలాస: రైసు మిల్లర్లు రైతులను మోసం చేస్తున్నారు. అందుకు కొంతమంది అధికారులు సహకరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసేవారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం దానికి భిన్నంగా వ్యవహరిస్తోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ప్రభుత్వంలో ఆర్‌బీకేలు ఉత్సవ విగ్రహాలుగా మిగిలాయి. ఇటీవల ముగిసిన ఖరీఫ్‌లో పలాస మండలంలో 10,529.63 ఎకరాల్లో వరి పంటను రైతులు సాగు చేశారు. ఇందుకు గాను మొత్తం 22,112.22 మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవ్వాల్సి ఉంది. అయితే 17,689.8 మెట్రిక్ టన్నులు మాత్రమే దిగుబడి వచ్చాయి. ఇప్పటి వరకు కేవలం 9,216 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే ప్రభుత్వం కొనుగోలు చేసింది. మిగతావి కొనుగోలు చేయాల్సి ఉండగా లిమిట్ అయిపోయిందని అధికారులు చేతులు దులుపుకుంటున్నారు. ఇంకా రైతులు వద్ద ధాన్యం నిల్వలు ఉన్నాయి. ఎప్పుడు వచ్చి కొనుగోలు చేస్తారా అని అన్నదాత ఆశగా ఎదురు చూస్తున్నారు. ఇదిలా ఉండగా రైతు భరోసా కేంద్రాలు ఈ ఏడాది నామమాత్రంగానే మిగిలాయి. ఈ కేంద్రాలు ద్వారా ఎక్కడా ధాన్యాన్ని కొనుగోలు చేసిన దాఖలాలు లేవు. తప్పని పరిస్థితుల్లో రైతులు దళారీలు ద్వారా సమీపంలోని మిల్లర్లకు నేరుగా వారికి నచ్చిన ధరలకు ధాన్యాని అమ్ముకున్నారు. ప్రభుత్వం ఏ-రకం ధాన్యాన్ని రూ.1860, సాధారణ రకం 1840 రూపాయలకు మద్దతు ధరను నిర్ణయించింది. ఈ ధరలు కూడా రైతులకు దక్కలేదు. తేమ, రాళ్లు, రెప్పలు పేరుతో కారు చౌకుగా తీసుకుపోయారు. ఇదిలా ఉండగా రవాణా చార్జీలు, గోనె సంచులు, కళాసీల చార్జీలను కూడా ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. క్వింటా ధాన్యం రవాణాకు రూ.26, ఒక సంచికి రూ.6.70 ప్రభుత్వమే చెల్లించాల్సి ఉంది. ఇవి కూడా మిల్లర్లు అధికారుల అండదండలతో మాయం చేశారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రైతులు ముందుగానే తమ వద్ద ఉన్న సంచుల్లో భద్ర పరిచిన ధాన్యాన్ని అలాగే తీసుకుపోయారు. అంతేకాకుండా 80 కిలోలకు బదులు అదనంగా మరో మూడు కిలోలు రైతులు నుంచి తీసుకు పోయారు. ఇంత జరుగుతున్న సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తునట్టు ఉండిపోయారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చ్చిన ధాన్యానికి కూడా ఇంత వరకు డబ్బులు అందలేదని చాలామంది రైతులు గగ్గోలు పెడుతున్నారు.

అధికారులు పట్టించుకోవడం లేదు



చివర ధాన్యం గింజ వరకు కొనుగోలు చేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం లక్ష్యం పూర్యయిందని చెప్పి కొనుగోలు ఆపేసింది. ఇంకా రైతుల వద్ద ధాన్యం ఉన్నాయి. దళారులు విచ్చలవిడిగా కొనుగోలు చేస్తూ రైతులను దోపిడీ చేస్తున్నారు. 80 కిలోలకు బదులు 83 కిలోలు తీసుకుపోతున్నారు. అధికారులు కనీసం పట్టించుకోవడం లేదు.

– తెప్పల అజయ్‌కుమార్, రైతు సంఘం నాయకుడు, మాకన్నపల్లి, పలాస మండలం

రైతులను దోచుకుంటున్నారు



పలాస మండలం రెంటికోట, అల్లుకోల, లొద్దబద్ర తదితర గ్రామాల్లో రైతులను దోచుకుంటున్నారు. ప్రభుత్వం కొనుగోలు చేయడమనేది ఒట్టి బూటకం. మిల్లర్లు మాత్రమే తమ దళారీల ద్వారా కొనుగోలు చేస్తున్నారు. పొల్లు ధాన్యం, తేమ, రాళ్ల రప్పలు పేరుతో మిల్లర్లు మాయ చేస్తున్నారు. తప్పని పరిస్థితిలో అమ్ముకోవలసి వస్తుంది. రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయడం లేదు.

– దువ్వాడ రవి, రైతు, అల్లుకోల, పలాస మండలం

కుంకుమార్చనలు



టెక్కలి మండలం నరసింగపల్లి గ్రామం కోదండ రామాలయం ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా శుక్రవారం ఆలయ ప్రాంగణంలో సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. వేద పారాయణాలు, సూర్య నమస్కారాలు, రుద్రాభిషేకాలు, విశేష హోమాలు చేశారు. గ్రామానికి చెందిన వేంకటేశ్వర భజన బృందం ఆధ్వర్యంలో భజన కాలక్షేపం జరిగింది.

– టెక్కలి

పరిశ్రమలు తనిఖీ



కంచిలి మండలంలోని బూరగాం, జలంత్రకోట సచివాలయాల పరిధిలో చిన్న, మధ్యతరహా పరిశ్రమలను ఎంపీడీవో వి.తిరుమలరావు శుక్రవారం తనిఖీ చేశారు. ఎంఎస్ఎంఈ సర్వేలో భాగంగా బూరగాం పరిధిలోని స్టోన్ క్రషర్ పరిశ్రమలను, జలంత్రకోట గ్రామ పరిధిలోని కిరాణా షాపులను సచివాలయ ఉద్యోగులతో కలిసి పరిశీలించారు. సర్వేలో మిస్సింగ్ సిటిజన్స్ సర్వేల ప్రగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. అంతకు ముందు సచివాలయాల పనితీరుపై సమీక్షించారు.

– కంచిలి

రోడ్డుపైకి మురుగు..



సంతబొమ్మాళి మహాత్మ గాంధీ జ్యోతిరావుపూలే బాలుర వసతి గృహంలోని మురుగునీరు ప్రధాన రోడ్డుపైకి వచ్చేస్తోంది. దీంతో వాహన చోదకులు, స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారు. దుర్వాసన వెదజల్లడంతో ఇక్కడకు సమీపంలో ఉన్న గుడికి వచ్చే భక్తులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. దీనిపై ఎన్నిసార్లు చెప్పినా హాస్టల్ సిబ్బంది పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

– సంతబొమ్మాళి

లైన్ ఇన్‌స్పెక్టర్‌కు సత్కారం..



నందిగాం విద్యుత్ శాఖలో లైన్ ఇన్ స్పెక్టర్‌గా పనిచేసి ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన కణితి కృష్ణారావు సేవలు మరువలేనివని 1104 యూనియన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ ఎం.వి.గోపాలరావు అన్నారు. స్థానిక సీతారామ కళ్యాణ మండపంలోనందిగాం సెక్షన్ వారి ఆధ్వర్యంలో కృష్ణారావు దంపతులను శుక్రవారం సత్కరించి ఆయన సేవలను కొనియాడారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎన్.కోటేశ్వరావు, స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ డి.శేఖర్, ఎ.గోపాలరావు, ఈశ్వరరావు, నందిగాం ఏఈ నేతాజీనాయుడు, హిమగిరి పాల్గొన్నారు.

– నందిగాం

తరగతుల విలీనం వద్దంటూ నిరసన



ఎంఈవో శివరాంప్రసాద్‌కు వినతి పత్రం అందజేస్తున్న గంగాధరపురం గ్రామస్తులు

కంచిలి: మండలంలోని పోలేరు పంచాయతీ పరిధి గంగాధరపురం ప్రాథమిక పాఠశాలలోని 3, 4, 5 తరగతులను వేరే పాఠశాలలో విలీనం చేయవద్దంటూ విద్యార్థుల తల్లిదండ్రులు నిరసన గళమెత్తారు. ఈ మేరకు వారంతా మండల విద్యావనరుల కేంద్రం ఎదుట శుక్రవారం ఆందోళన వ్యక్తం చేశారు. ఎట్టిపరిస్థితుల్లోనూ తరగతులను విలీనం చేయడానికి ఒప్పుకొనేది లేదని తేల్చిచెప్పారు. ఈ పాఠశాలలో 28 మంది చదువుతుండగా.. వారిలో 3, 4, 5 తరగతులకు సంబంధించి 17 మంది విద్యార్థులున్నారన్నారు. వీరిని పంచాయతీ కేంద్రం పోలేరు పాఠశాలలో విలీనం చేయడానికి అధికారుల ప్రతిపాదనలు తమను విస్మయపరిచాయని అన్నారు. తమ గ్రామంలో 2018-19 విద్యా సంవత్సరం నుంచి గ్రామానికి చెందిన పిల్లల్ని ప్రైవేటు పాఠశాలల్లో చేర్చరాదని కట్టుబాటు తీసుకొచ్చి, అందర్నీ ఈ పాఠశాలలోనే చేర్పిస్తున్నామని పేర్కొన్నారు. అటువంటి తమ పిల్లల్ని వేరే పాఠశాలకు పంపించడానికి రవాణా ఖర్చులు ఇస్తామని ఆశ చూపినా పంపబోమని స్పష్టం చేశారు. వేరే పాఠశాలలో తరగతుల విలీనం వద్దని విజ్ఞప్తి చేస్తూ ఎంఈవో ఎస్.శివరాంప్రసాద్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ ఎం.హిందూ, వైస్ చైర్మన్ ఎన్.సంధ్య, గ్రామస్తులు జి.చిరంజీవి, ఎన్.బాలక్రిష్ణ, ఎం.హరిబంధు తదితరులున్నారు.

హెల్త్‌సెంటర్ల అభివృద్ధి అందరి బాధ్యత



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ జుహితా

ఇచ్ఛాపురం: పట్టణంలో ఏర్పాటు చేసిన హెల్త్ సెంటర్లను అభివృద్ధి చేసుకోవడం మనందరి బాధ్యతని అర్బన్‌హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ జుహితా అన్నారు. పురుషోత్తపురం పట్టణ ఆరోగ్య కేంద్రం ఆవరణలో ఆరోగ్య, పారిశుద్ధ్యం, పోషకాహార కమిటీ(యూహెచ్ఎస్ఎన్‌సీ) సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్త్‌సెంటర్ అభివృద్ధితో పాటు పరిసరాల పరిశుభ్రత గురించి అవసరమైన సలహాలు, సూచనలు చేశారు. సమావేశంలో ఒకటో వార్డు కౌన్సిలర్ సుగ్గు ప్రేమ్‌కుమార్, గ్రామపెద్దలు చాట్ల తిరుపతి, హెల్త్‌సెంటర్ సిబ్బంది, ఆశవర్కర్ గుణవతి, డి.కేశవరావు, మాధవరావు, వెంకట్ పాల్గొన్నారు.

‘తప్పుడు ఆరోపణలు తగవు’



మాట్లాడుతున్న రవికుమార్‌రెడ్డి

సంతబొమ్మాళి: అధికార పార్టీ మెప్పు కోసం తప్పుడు ఆరోపణలు చేయడం కొంతమంది టీడీపీ నాయకులకు తగదని వైఎస్సార్‌సీపీ నాయకుడు, నౌపడ మాజీ సర్పంచ్ పి.రవికుమార్‌రెడ్డి అన్నారు. నౌపడలో అయన శుక్రవారం విలేకర్లతో మాట్లాడుతూ.. పంచాయతీలో 160 మందికి జగనన్న ఇంటి పట్టాలు ఇచ్చామని, అలాగే గతంలో వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన వివిధ పథకాలను అర్హులకు అందేలా కృషిచేశామన్నారు. ఏ ఒక్కరి దగ్గర పైసా కూడా ఆశించకుండా నిజాయతీగా రాజకీయం చేశామని చెప్పారు. ఇంకా అర్హులు ఉండిపోతే వైఎస్సార్ కాలనీలో ఐదుగురు పేదవారికి ఇంటి స్థలాల పొజిషన్ సర్టిఫికెట్లు అందజేశామన్నారు. అయితే వీళ్లలో వీరు గొడవపడి ఇంటి నిర్మాణాలు చేయకుండా కాలయాపన చేశారన్నారు. తరువాత కూటమి ప్రభుత్వం రావడం.. గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు స్పందనలో ఫిర్యాదు చేయడంతో ఇంటి పట్టాల పొజిషన్ సర్టిఫికెట్లను రద్దు చేయడం జరిగిందన్నారు. రద్దయిన ఇంటి పట్టాల స్థలాలు ఇప్పించాలంటే వైఎస్సార్‌సీపీ నాయకులు లంచాలు తీసుకున్నారని చెప్పాలని స్థానిక కొందరు టీడీపీ నాయకులు పన్నిన కుట్రలో భాగమే ఆరోపణలు చేయడమన్నారు. ఆ కుట్రలో భాగంగా ఐదుగురు లబ్ధిదారుల్లో ఇద్దరితో తప్పుడు ఆరోపణలు చేయించారని మండి పడ్డారు. రాజకీయంగా ఎదుర్కొనలేక ఇలాంటి చౌకబారు ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. సత్తా ఉంటే ఐదుగురు లబ్ధిరులకు న్యాయం చేయాలని హితవుపలికారు.

పిచ్చి మొక్కల తొలగింపు



పిచ్చిమొక్కలను తొలగించిన దృశ్యం

సాక్షి ఎఫెక్ట్...

ఇచ్ఛాపురం రూరల్: స్థానిక ఇందిరా క్రాంతి భవనం పిచ్చి మొక్కల మధ్య నిరుపయోగంగా ఉందంటూ శుక్రవారం ‘సాక్షి’ది నపత్రికలో ప్రచురితమైన కథనానికి సెర్ప్ సిబ్బంది స్పందించారు. కార్యాలయం చుట్టూ పిచ్చి మొక్కలు తొలగించారు. స్వయం సహాయక సంఘాలు సమావేశాల్ని ఇక నుంచి ఏర్పాటు చేసి, భవనాన్ని సద్వినియోగం చేసుకుంటామని ఏపీఎం సనపల ప్రసాదరావు తెలిపారు.

మందస స్టేషన్‌లో రైలు నిలుపుదలకు డీఆర్ఎంకు వినతి



పరమేశ్వర పంక్వాల్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కాశీబుగ్గ: మందస రైల్వే స్టేషన్‌లో కటక్-గుణుపూర్ పాసింజర్, బరంపురం-విశాఖ ఇంటర్‌సిటీ, భువనేశ్వర్-బెంగళూరు ప్రశాంతి, భువనేశ్వర్-సికింద్రాబాద్ విశాఖ ఎక్స్‌ప్రెస్, రౌర్కెలా గుణుపూర్ రైళ్లను నిలుపుదల చేయాలని ఈస్ట్ కోస్ట్ రైల్వే రైల్వే జెడ్ఆర్‌యూసీసీ మెంబర్ శ్రీనివాస్ రౌలో, కొత్ర ఆనందరావు, రౌతు చిరంజీవులు, కొత్ర రామారావు కోరారు. ఈ మేరకు రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర పంక్వాల్‌ను శుక్రవారం కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. మందస రైల్వే స్టేషన్ నుంచి కమలాపురానికి వంతెన నిర్మాణం చేపట్టాలని, విభిన్న ప్రతిభవంతులకు స్టేషన్‌లో బ్యాటరీ వాహనాలు ఏర్పాటు చేయాలని, ప్రయాణికులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని వినతిపత్రంలో కోరారు. ఆంధ్ర, ఒడిశా సరిహద్దుతో పాటు ఉద్దానం గిరిజన గ్రామాల ప్రజలు.. వలస కార్మికులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారని, కిడ్నీ రోగులు ఇతర ప్రాంతలకు రైళ్లలో నిత్యం వెళ్లి వస్తుంటారని జనరల్ మేనేజర్ దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన సానుకూలంగా స్పందించి తగు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ప్రతినిధులు జి.చంద్రశేఖర్, ఎస్.ధర్మారావు, ఎస్.గణేష్, కె.సోమేశ్వరరావు, కె.సురేష్, ఎం.నారాయణ ఉన్నారు.

స్థానిక జీడిపిక్కలే కొనుగోలు చేయాలి



ఎమ్మెల్యే శిరీషకు వినతిపత్రం అందిస్తున్న జీడి రైతులు

కాశీబుగ్గ: స్థానికంగా ఉన్నటువంటి ఉద్దాన ప్రాంత జీడిపిక్కలను కొనుగోలు చేసిన అనంతరమే విదేశీ పిక్కల కొనుగోలుకు అనుమతి ఇవ్వాలని ఉద్దాన జీడి రైతులు కోరారు. ఈ మేరకు పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషను శుక్రవారం తన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. జీడిపిక్కలు, పండ్లు కోసం ప్రోసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలని, జీడి పంటకు బీమా, రైతులకు రుణాలు మంజూరు, జీడి తోటల్లో పనుల కోసం ఉపాధి నిధులు కేటాయించాలన్నారు. జీడి పరిశోధన కేంద్రం ఏర్పాటు, రూ.16 వేల మద్దతు ధర కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో రైతు సంఘాల నాయకులు కె.మోహనరావు, తెప్పల అజయ్‌కుమార్, ఎస్.గణపతి, జినబాలక్రిష్ణ, కోనేరు ఆదినారాయణ, మద్దు రాఘవరావు, జి.నీలకంఠం, బర్ల గోపి, లండ జీవన్, సాలిన కూర్మారావు, కోదండరావు, దాసరి మోహనరావు ఉన్నారు.

వైభవంగా తిరుక్కల్యాణోత్సవాలు



కల్యాణోత్సవంలో భక్తులు

కవిటి: మండలంలోని లోళ్లపుట్టుగలో వెలసిన శ్రీదేవీ, భూదేవీ సమేత వేంకటేశ్వరస్వామికి 44వ తిరుక్కల్యాణ, 55వ వార్షికోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ అనువంశిక ధర్మకర్త సంక రాజేష్ దంపతుల ఆధ్వర్యంలో ఆలయ ప్రధానార్చకులు ఎం.అప్పలస్వామి, చక్రధర, అర్చకులు బి.రాజేష్ స్వామి ఆధ్వర్యంలో సంప్రదాయబద్ధంగా విశ్వక్సేన పూజ, ఋత్విక్‌వరుణ, అభిషేకం, అర్చన తదితర ప్రత్యేక కార్యక్రమాల అనంతరం లోకకల్యాణార్థం హోమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా తిరుమల తిరుపతి దేవస్థానం అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారిని జయంతి సావిత్రీచే హరికథాగానం ఆహూతులను అలరించింది. అధికసంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వైఎస్సార్‌సీపీ పటిష్టతకు కృషి



నందిగాం: తిలక్‌కు సత్కరిస్తున్న ఫాల్గుణరావు

టెక్కలి: గ్రామ స్థాయిలో వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేస్తామని నూతనంగా నియామకమైన మండల అధ్యక్షులు హనుమంతు వెంకటేశ్వర్రావు, సంపతిరావు హేమసుందర్‌రాజు, తమిరె ఫాల్గుణరావు, బుడ్డ మోహన్‌రెడ్డితో పాటు టెక్కలి టౌన్ అధ్యక్షుడు తమ్మన్నగారి కిరణ్ వెల్లడించారు. శుక్రవారం వారంతా మాట్లాడుతూ.. తమపై ఎంతో నమ్మకంతో ఇచ్చిన మండల అధ్యక్షుల పదవులతో గ్రామ స్థాయిలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అండగా, ప్రజల సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తామని పేర్కొన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్, జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

- ఇచ్ఛాపురం: పార్టీని మరింత బలోపేతం చేసేందుకు తనవంతు కృషి చేస్తానని వైఎస్సార్‌సీపీ ఇచ్ఛాపురం పట్టణ అధ్యక్షులుగా ఎన్నికైన బలివాడ ప్రకాశరావుపట్నాయక్ అన్నారు. పదవి వచ్చేందుకు సహకరించిన జిల్లాపార్టీ అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్, జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీనర్తు రామారావులకు కృతజ్ఞతలు తెలియజేశారు. రెండోసారి పట్టణ అధ్యక్షులుగా ఎన్నికైనందుకు మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి, వైస్‌చైర్‌పర్సన్లు ఉలాల భారతిదివ్య, లాబాల స్వర్ణమణి, కౌన్సిలర్లు అభినందించారు.
- నందిగాం: పార్టీ పటిష్టతే తన ధ్యేయమని నందిగాం మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడుగా ఎన్నికైన తమిరె ఫాల్గుణరావు అన్నారు. నందిగాం పార్టీ కార్యాలయంలో టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేరాడ తిలక్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సత్కరించారు. ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కురమాన బాలక్రిష్ణారావు, దళిత నాయకుడు అక్కురాడ లోకనాథం ఉన్నారు.
- సోంపేట: మండలంలో పార్టీ అభివృద్ధికి కృషిచేస్తానని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శిలగాన భాస్కరరావు తెలిపారు. జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్, జెడ్పీ చైర్‌పర్సన్ విజయ, ఎమ్మెల్సీ రామారావు, మాజీ ఎమ్మెల్యే సాయిరాజ్, ఎంపీపీ నిమ్మన దాస్‌కు ధన్యవాదాలు తెలియజేశారు.

సంక్షిప్తంగా..

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

కాశీబుగ్గ: చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని కాశీబుగ్గ రూరల్ సీఐ తిరుపతిరావు అన్నారు. మందస మండలం హరిపురం, బాలిగాం జంక్షన్ వద్ద ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మత్తు పదార్థాలు, గుట్కా, పాన్ మసాలాలు, సిగరెట్, గంజాయి వంటి చెడు అలవాట్లను చేసుకొని జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. మాదక ద్రావ్యాలు వినియోగించినా, రవాణా చేసేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్సైలు శేఖర్, నీలకంఠం, కానిస్టేబుల్ ఢిల్లీరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయానికి విరాళం

కంచిలి: మండల కేంద్రం కంచిలిలో కొలువై ఉన్న కంచమ్మతల్లి అమ్మవారికి కమిటీ ఆధ్వర్యంలో రూపొందిస్తున్న బంగారు జడపాలి నిమిత్తం సోంపేటకు చెందిన భక్తులు ఒక తులం బంగారం, దేవస్థానం అభివృద్ధి కోసం రూ. 11 వేలను విరాళంగా అందజేశారు. వీటిని ఆలయ కమిటీ ప్రతినిధులకు శుక్రవారం అందజేశారు. విరాళం అందజేసిన వారిలో మల్లా వెంకటరమణ, భాస్కరరావు, రమాకాంత్, ధర్మకుమార్ ఉన్నారు.

భగవద్గీత పోటీలు రేపు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ మదర్ థెరిసా పాఠశాల ఆవరణలో ఈ నెల తొమ్మిదో తేదీన భగవద్గీత పోటీలు నిర్వహించనున్నట్లు విశ్వహిందూ పరిషత్ సంఘటన కార్యదర్శి చల్ల చంద్రమౌళి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆ రోజు మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు జరగనున్న పోటీలకు జిల్లా వ్యాప్తంగా 38 పాఠశాలకు చెందిన విద్యార్థులు పాల్గొంటారన్నారు.

రజక సంఘం నూతన కార్యవర్గం

సోంపేట: సోంపేట రజక సంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. సంఘ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యవర్గాన్ని ఎనుకున్నారు. అధ్యక్షుడుగా కొజ్జిరి రమేష్, కార్యదర్శిగా రామిశెట్టి రంజిత్‌కుమార్, ఉప కార్యదర్శిగా కొవ్వూరు చిన్నరాజు, చైర్మన్లుగా జగన్నాధపురం మోహనరావు, మామిడిపల్లి సుందరరావు, కోశాధికారులుగా నిమ్మాడ మోహనరావు, తూరాల శ్యామ్ నియమితులయ్యారు. సంఘ సమస్యలు పరిష్కారానికి కృషిచేస్తామని నూతన కార్యవర్గ సభ్యులు తెలిపారు.

ముఖ్యకూడళ్లలో సీసీ కెమెరాల ఏర్పాటు

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని అన్ని ముఖ్య కూడళ్లలో భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై ఇ.శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఆయన లొద్దపుట్టి, తులసిగాం, ధర్మపురం గ్రామాల్లో పర్యటించి స్థానికుల సహాయంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

ఇచ్ఛాపురం: ఆన్‌లైన్ మోసాల పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని పోలీస్ సర్కిల్‌ఇన్‌స్పెక్టర్ మీసాల చిన్నంనాయుడు అన్నారు. పురపాలకసంఘం కంద్రవీధిలో ఆన్‌లైన్ మోసాలు, బాల్యవివాహాలు, మైనర్‌డ్రైవింగ్, డ్రగ్స్ నియంత్రణపై శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. తల్లిదండ్రులు వారి పిల్లల ప్రవర్తనను గమనిస్తుండాలన్నారు. హెచ్‌సీ రామారావు ఉన్నారు.

మందస ఎంపీడీవోగా రమేష్‌నాయుడు



బాధ్యతలు స్వీకరించిన రమేష్‌నాయుడు

మందస: మందస ఎంపీడీవోగా రమేష్‌నాయుడు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. వజ్రపుకొత్తూరు ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న ఈయకు పూర్తి అదనపు బాధ్యతలతో మందసకు ఇన్‌చార్జిగా ఉన్నతాధికారులు నియమించారు. ఆయనకు మండల పరిషత్ పరిపాలనాధికారి రుషేశ్వరరావుతో పాటు కార్యాలయ సిబ్బంది, కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది, పలువురు నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

సక్రమంగా పారిశుద్ధ్య నిర్వహణ

టెక్కలి: మేజర్ పంచాయతీలో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా ఉండాలని టెక్కలి ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి సిబ్బందికి సూచించారు. పట్టణంలోని పలు వీధుల్లో శుక్రవారం పర్యటించి పారిశుద్ధ్యాన్ని పర్యవేక్షించారు. అనంతరం ఆర్డీవో మాట్లాడుతూ.. మేజర్ పంచాయతీలో పలు వీధుల్లో పారిశుద్ధ్య నిర్వాహణ విషయంలో సిబ్బంది ప్రత్యేకంగా దృష్టిసారించాలన్నారు. ఎక్కడా లోపం లేకుండా రోజూ పర్యవేక్షణ చేయాల్సిన బాధ్యత కార్య నిర్వాహణాధికారిపై ఉందన్నారు. ఈవో జగన్నాథం ఉన్నారు.